కవితా కౌముది

# మాయా? భ్రమా?

భువనచంద్ర

నేను గుర్తించే ఓ శరీరం
భువినుండి దివికి తరలిపోయింది
నన్ను గుర్తించే ఒక ఆత్మ
శరీరంలేని నీడలా లోకంలో మిగిలే ఉంది!
శరీరానిదేముంది!?
అది పుడుతుంది..నశిస్తుంది.
అది నవ్వుతుంది..ఏడుస్తుంది..
అది ఆలోచిస్తుంది..అవలోకిస్తుంది..
కానీ అది అశాశ్వతం..
కానీ శాశ్వతమైన దేమిటో
అశాశ్వతమైన శరీరాన్ని ధరించిన వారికెలా తెలుస్తుంది?
అందుకే ఒక రాజీ కొస్తా..!
తెలిసింది..తెలియదని..
తెలియరాని దాన్ని..తెలుసుకోలేమనీ!
ఏదయితేనేం?
నీడకి ఆధారం శరీరం
కానీ శరీరం నీడకాదు..
మనసుకీ ఆత్మకీ గృహం శరీరం!
కానీ ఆత్మ శరీరం కాదు!
వేదాలు చెబుతాయి
ఉపనిషత్తులు ఘోషిస్తాయి..
ప్రతిమతం..తన వాదాన్ని నమ్మకాన్నీ వినిపిస్తుంది.
కానీ నేస్తం..
మృత్యువు ఏ మతం మాట వింటుంది?
బ్రతుకు ఏ నమ్మకాన్ని బట్టి నడుస్తుంది?

పుట్టుకా.. మరణమూ..
బొమ్మా బొరుసూలా
పక్కపక్కనే ఉన్నా
ఒకరిముఖం మరికటి చూసుకోదు!
'పంచదార పాలు లా ఆ రెండూ కలిసే ఉంటాయి..' అని తెలిసినా
పిచ్చిమనసు విడదీస్తూనే ఉంటుంది!
మనసు సంగతా?
అది భ్రమని కల్పిస్తుంది..
భ్రమలో బ్రతికిస్తుంది..
భ్రమలాంటి మరణాన్ని వెదుక్కుని
భ్రమలో కలిసిపోతుంది..!
ఆ క్షణంలో
నిజమేమిటి?
అబద్ధమేమిటి.. ?
ఆది ఏమిటి?
అనంతమేమిటీ?
గుడ్డివాడు చీకట్లో వెదికే 'ఓ గుండుసూది' లాంటిది జీవితం
అది దొరుకుతుందా?
మనసుకి వేసిన తెరల్ని విప్పుతుందా?
'నాదీ - నేనూ - అంటూ బ్రతికే ఓ మనిషీ
'నీది ' అనేది అసలుందా?
లేని దానికోసం వెంపర్లాటలెందుకూ?
మాయో, భ్రమో..ఉన్నదానిలోనే
సహజీవనం సాగిస్తే పోలా..! ***

# ఆహ్వానం

## అత్తలూరి విజయలక్ష్మి

నిన్నటి నేడులో నాకీ ప్రపంచం తమాషాగా కనిపిస్తోంది
చూస్తూ చూస్తుండగానే విశాలమైన ప్రపంచం కుంచించుకుపోయింది
పచ్చని చెట్లన్నీ పత్రహరితం కోల్పోయి మసకబారాయి
మేఘాలన్నీ పొడిబారి బూడిద రాలుస్తున్నాయి
మంచిమనసులు చిరునామాలేక అనాధలైనాయి
మనిషి ఉనికి మచ్చుక్కూడా దొరకడంలేదు
యువత గమ్యం కోసం అన్వేషిస్తూ అగమ్యంగా తిరుగుతోంది
నీతి బురదగుంటలో జారిపడి ఆసరాకోసం అలమటిస్తోంది
ధర్మం కాళ్ళు విరిగి కుంటిదైంది
న్యాయం గాంధారిపై జాలిపడి తోడుగా వెళ్ళింది
హింస విశృంఖలంగా విహరిస్తోంది
కామం ఒంటినిండా రోమాలతో జుగుప్సగా కనిపిస్తోంది
ఏంటి! ఋతువులన్నీ ఇలా రగులుకుంటున్నాయి!
భగ, భగ మండుతూ సంస్కారాన్ని, సంస్కృతినీ ఆజ్యంలా
మమతలనూ, మమకారాలనూ చితుకుల్లా పేర్చుకుంటూ
ఈ ప్రపంచాన్ని గుళికలా చేసుకుని మింగేస్తున్నాయి....
అయ్యో మానవత్వమా నువ్వెక్కడ?
అంతరించిపోతున్న ప్రపంచంలో నీ ఉనికి ఎక్కడ?
అదిగో మురుగుకాలవలో ఈగవై, గజ్జి కుక్క ఒంటిమీద పురుగువై
దుర్గంధభూయిష్టమై పరిభ్రమిస్తున్నావు...ఆదరించే తోడులేక అలమటిస్తున్నావు.
ఫర్వాలేదు... ఆత్మాహుతితో పునీతవుకా.....
నీతినీ, ధర్మాన్నీ ఒంటికి చుట్టుకుని ఆడమ్ గా మళ్ళీ అవతరించు
ఈవ్ సంపర్కంతో భూత, భవిష్యత్,వర్తమానాలను పునః స్రష్టించు....
పూర్ణ కలశంతో ఆహ్వానించడానికి నేనున్నాగా
నన్ను నమ్ము.... !!!!

****



# మురళి

వారణాసి నాగలక్ష్మి

వెదురు బొంగుని వేణువుగా ఊదుతూ
పొలాల కావల బీడంతా తిరుగుతాడు
పసుల కాసే పసివాడు..
పెద్దల సేవా పిల్లల ఆలనా
పెద్దింటి కోడలిగా పనుల్లో సతమతమై
మనసూ తనువూ అలసిన వేళ..
అనుకోకుండా వినిపిస్తుంది వాడి మురళి
చల్లని పిల్ల గాలిలా వచ్చి నన్ను చుట్టేసి కట్టేస్తుంది!
మబ్బు పట్టిన మధ్యాన్నం ఒకలా
గుబులు పుట్టే శిశిర సంధ్యలో ఇంకోలా
చిక్కని మౌనం కప్పిన చీకటిలో మరోలా..
వెన్నెల్లోనూ, కొమ్మల నీడల్లోనూ
విరిసే పూలమీడా,తడిసిన ఆకుల మీదా ....
అంతటా పాట వ్యాపిస్తుంది!
పాపాయికి పాల బువ్వా , బుజ్జాయికి గోరుముద్దా
తినిపించి, జోకొట్టి నిదురపుచ్చి,
పతి పరిష్వంగంలో పవళించే వేళ
ఆ పాట అలలు అలలుగా తేలి వస్తుంది.!
వచ్చీ రాని వాడి పాట..
గాలివాటున వొచ్చేసి
నా గుండెలో గూడు కట్టేస్తుంది..
వాడి అవ్యక్త భావాలెన్నిటినో
నా మస్తిష్కంలో పేరుస్తుంది..
ఆ పాటలోని తడి నా కంటిలోకి జారి
కన్నీరై పోతుంది!
ఎవరింటి పసి వాడో.. ఎవరింట పనివాడో ..
పిడికెడన్నమైనా తిన్నాడో.. పస్తున్నాడో..
అమ్మ గోరుముద్దల రుచి తెలుసో లేదో ..
పాల బుగ్గల పసితనం కరిగిందో లేదో
ఊరుమాటు మణిగేదాకా గొడ్ల పనీ ఇంటి పనీ కానిచ్చి
దొర కోసం పక్క పరిచి కాళ్ళు పిసుకుతాడు కాబోలు!
లోకమంతా కలల్లో తేలే వేళ
మురళి తీసి మోవికానిస్తాడు!
జాబిల్లి చల్లదనం, వెన్న ముద్ద కమ్మదనం
కన్నయ్య కన్నుల్లో జాలువారే కరుణరసం
రంగరించి రసం తీసి వేణువులో చొప్పిస్తాడు !
వెతలన్ని మరపిస్తూ వెదురునే మురిపిస్తాడు !
తల్లడిల్లే హృదయాలని తల్లిలా ఊరడిస్తాడు..
వేదననే నవ్వించే వేదాంతి తానై
అమ్మలకే జోలపాడి జోకొడతాడు ! ***

# తెలుగు వనిత

ద్వాదశి రామలక్ష్మి

తెలుగు వనిత - సుగుణ భరిత
నూతన చరిత - శౌర్యపు గరిత
కవుల వినుత - నిగమ భూషిత
భావాల కవిత - రాగల ఫలిత
దీనుల పోషిత - తీయని మమత
విద్యల ముదిత - జాతికి సమత
సంగీత ప్రియుత - సాహిత్య కలిత
పురాణ పూజిత - కావ్యాల కీర్తిత
భాగ్యాల రంజిత - అమల పునీత
కోమల లలిత - నాట్యాల నెలత
ఇంటికి దేవత - తానుంటే మాజత
లేదిక ఏ వెత - రాదిక కలత!!

****

# అద్దంలో దాగిన నేను

మాధవ తురుమెళ్ళ

అద్దంలో
నన్ను నేను చూసుకోవడానికి
పుట్టుకతోటే అలవాటుపడిపోయాను..
చిన్నప్పట్నించీ,
అద్దం నన్ను ప్రతిబింబిస్తూ
నన్ను నాకు చూపిస్తూ ప్రపంచాన్ని కప్పేస్తూ వచ్చింది.
అద్దం మెల్లగా -
కర్ణుడి కవచంలాగా -
నా కళ్ళకు డాలుగా మారిపోయింది.
నిరంతరం నన్ను నేను ప్రతిబింబచేసుకుంటూ
నన్ను నేను ప్రేమించుకుంటూ -
నువ్వనే దానివి ఉన్నావనిగానీ,
మూసిన పెదవుల వెనుక శబ్దంచెయ్యని
ఆర్తనాదాలు చేస్తున్నావనిగానీ,
వంటింటికోరల్లో నలిగి మగ్గిపోతున్నావనిగానీ,
ప్రేమకు నోచుకోక దీనంగా
అవనతవదనంతో దారిపక్క నిలుచున్నావనిగానీ,
ఏదోఒక రోజు మారకపోతాడా అని -
మోడువారిన సంసారపు మొక్కకు -
సహనం నీరుపోస్తూ నిరీక్షిస్తున్నావనిగానీ,
గమనించలేకపోయాను...
నీవులేని నాడు
నీ సహాయంపొందని నాడు
నా ప్రతిబింబానికి అర్థంలేదని
నా అద్దం నాకెప్పుడూ చెప్పలేదు!
నా కళ్ళ ముందు పరుచుకున్న అద్దం నన్నేచూపిస్తూ
ఆకలితీరిన నా బొజ్జని చూపిస్తూ,
నిన్ను చూపించకుండా దాచి
నీచేత
అందంగా తీరైన నా ఇల్లుని చూపిస్తూ,
అద్భుతమైన జీతంగా మారిన నా కొలువుని చూపిస్తూ,
అద్దం -
నా జీవితాన్ని చుట్టలా చుట్టుకుని అందమైన అబద్ధంగా
మార్చింది.
పసిపిల్లలకి అద్దంచూపించకు ఎత్తుపళ్ళు వస్తాయంటూ అంటే
మూఢనమ్మకమేమో అని భావించిన నేను
పెరుగుతూ పెరుగుతూ
నా చుట్టూ ఎత్తుగా కట్టుకున్న అద్దపుగోడను
చూడలేకపోయాను,
నీవనేదాన్ని
అద్దానికి ఆవల ఉంచానని
గమనించలేకపోయాను.
క్రమక్రమంగా
నీవు నాపై చూపించిన ప్రేమతోనో
నీ చక్కటి మాలిమితోనో
నీవు కురిపించిన దయార్ద్ర వర్షంతోనో
నీవు పెట్టిన అన్నంతోనో
నీవు పంచి ఇచ్చిన ప్రణయంతోనో
దేనికో చలించిననేను
నీకు బహుమతి ఇవ్వాలనుకుంటూ,
నా మనసనే పూలసజ్జను అందమైన
ప్రేమపూలతో నింపాలనుకుంటూ
చేసే ప్రయత్నంలో
అనుకోకుండా -

అప్పటిదాకా
నా గుండెలో నిండిన బండరాళ్ళను
రివ్వున బయటకు విసిరేసాను
అప్పుడే -
నిన్ను నాకు నిజంగా బహుమతిగా ఇచ్చిన
భగవంతుని దయతో
నా  అద్దం, నా జీవితపు అబద్ధం ---
భళ్ళుమని బద్దలైంది...
ఆ రోజు ---
అనేకానేకాలుగా చిద్రమైన నా రూపం
పోల్చుకోలేనంత పగిలిపోయింది
నీవే నేనుగా మారిపోయింది
అందాన్నే ప్రతిబింబింపచేయ ప్రారంభించింది.
ఈవేళ -
నా కళ్ళ ముందు నన్ను చూపించే అద్దం లేదు,
నీకూ నాకూ ఎలాంటి అడ్డూ లేదు,
నిన్ను పలకరించాలన్న నా తహ తహలో  వ్యాపారంలేదు,
నీ చేతిని పట్టుకున్న నా చేతలో స్వార్థంలేదు,
నిన్నుచూసి ప్రేమగా నవ్విన నా కళ్ళ లో వ్యభిచారంలేదు.
ప్రియతమా -
నా అద్దం బద్దలై నేను
సిధ్ధుడిలా మారాను
సిద్దార్డుడిలా నవ్వాను
ఆనందతాండవం ఆడేందుకు సిద్ధమైన శివునిలా
ఇప్పుడిలా నీ ముందు నిలుచున్నాను....
నీ ప్రేమలో నా జీవితానికి ఆనందగీతం
నిన్ను నాకిచ్చిన భగవంతునికై ధన్యవాదగీతం పాడుతున్నాను. ***



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

**మధుర మధురమైనట్టి నీ మాట కొరకు**
నన్ను పల్కరించెడు చిరునవ్వు కొరకు
ఎదురు చూచుచు గడపెదనెన్ని నాళ్ళొ
కోరుచుందునెపుడు పేద కోరికలను

**వచ్చు నీ చరణముల సవ్వడులు వినగ**
సవ్వడుల వెన్క  నిశ్శబ్దసరళి కనగ
అనునయించు నీ కనుచూపునందు కరుగ
ఇనుని చంద్రుని గతుల లెక్కించుచుందు

**చూడ్కులే చాలు కోరికల్ శూన్యమంచు**
శూన్యదృక్కుల సారించి స్రుక్కుచుందు
కరిగి నీ చూపు నాపైన బరపినపుడు
చాలునిదియంచు నిను వీడి సాగగలనె?

**ఎండి నెరియలు పడ్డ యీ గుండె పైన**
రెండు చిన్కులు చాలిన మెండటంచు
తలచి యల్పసంతోషినైమెలగుచుందు
వలయు వర్షధారలటంచు తెలియలేను

**కనులు కలసిన చిరునవ్వు కాన్క  వలయు**
హాసముల వెన్క మధుర వాక్యములు వలయు
వాక్యముల వెన్క ప్రేమ సంపదలు వలయు
కోరికల బాట తుదిని కన్గొనని బాట

***

POST YOUR COMMENTS